

**మత్తు.. చిత్తు**

యూత్‌ను టార్గెట్ చేస్తున్న కొందరు గంజాయి వంటి మత్తు పదార్థాలను ఇతర ప్రాంతాల నుంచి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. 8లో



**బిర్యానీ తెమ్మని.. కారుతో పరారీ**

క్రైమ్ బ్రాంచి పోలీసునని పరిచయం చేసుకున్న ఓ వ్యక్తి డ్రైవర్‌ను బిర్యాని తెమ్మని చెప్పి, కారుతో ఉడాయించిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. 8లో



**గొల్ల, కురుమల సంక్షేమానికి పెద్దపీట**

గొల్ల, కురుమల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. 9లో

## న్యూస్‌రీల్

### బకాయిలపై మౌనం తగదు



మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

జహీరాబాద్: చెరకు రైతులకు రావాల్సిన బకాయిలపై యాజమాన్యం మౌనం వహించడం తగదని అఖిల పక్షం, రైతు సంఘం నాయకులు అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. బకాయిలపై స్పష్టత లేకపోవడంతో రైతులు అయోమయం చెందుతున్నారని, ట్రిడెంట్ యాజమాన్యం స్వయంగా ప్రకటన చేయాలని కోరారు. సమావేశంలో టీజేఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆశప్ప, రైతు సంఘం నాయకుడు కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పి.నర్సింహారెడ్డి, గుండ్‌రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, జగదీష్, శేఖర్, బీఎస్పీ నాయకులు అలెగ్జాండర్, అలీం, ప్రేమ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

### క్షేత్ర పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థినులు

జహీరాబాద్: కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాల విద్యార్థినులు ఆదివారం మండలంలోని రంజోల్ రైతు వేదికను సందర్శించారు. గ్రామీణ వ్యవసాయ సంక్షేమ అనుభవ ప్రాజెక్టు శిక్షణలో భాగంగా రైతు వేదికను సందర్శించి, రైతులకు అందుతున్న సేవలపై ఏఈఓ ప్రదీప్‌ను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ గ్రంథాలయం, ఔషధ మొక్కలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో సాగవుతున్న ఆలు, అరటి, జామ, సపోట, డ్రాగన్ ఫ్రూట్, కొత్తిమీర, పుదీన పంటల వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి ఫల పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుచిత్ర, శాస్త్రవేత్తలు హరికాంత్, నితీష్, విద్యార్థినులు కీర్తన, దివ్య, అఫ్రినా, భవానీ, చైతన్య, మాధవి, నవ్య, అర్చన, భార్గవి, మహిమ, లక్ష్మి, వెన్నెల ఉన్నారు.

### అభ్యర్థుల ఎంపిక పూర్తి



నియామకపత్రాలు అందజేస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

కొండాపూర్(సంగారెడ్డి): జిల్లాలోని సమగ్ర శిక్ష అభియాన్ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేసేందుకు 38 మందిని ఎంపిక చేసినట్టు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. స్పెషల్ ఆఫీసర్, పీజీ సీఆర్‌టీ, సీఆర్‌టీ, పీఈటీ, నర్సింగ్ పోస్టులకు అర్హత గల అభ్యర్థులను కౌన్సిలింగ్ ద్వారా ఎంపిక చేసి, నియామక పత్రాలు అందించినట్లు పేర్కొన్నారు.

### గురుకులాల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సురేష్

కొండాపూర్(సంగారెడ్డి): జిల్లాలోని గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సంగారెడ్డి టీపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో గురుకులాల పరిస్థితి దారుణంగా ఉందని, ఆర్‌సీఓ కార్యాలయంలో అవినీతికి పాల్పడుతున్న సూపరింటెండెంట్ ఆంజనేయులును సస్పెండ్ చేయాలని, అధికార దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గంజి హర్షిత్, డివిజన్ నాయకులు సమీ, సిద్దేశ్వర, శ్రీకాంత్, మహమ్మద్ ఉమ్మర్, సురేష్, పవన్, సిద్ధార్థ్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

### అందరికీ నెగెటివ్



పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. నలుగురికి కోవిడ్ ర్యాపిడ్ యాంటీజన్ టెస్టులు నిర్వహించగా అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. ఆర్టీపీసీఆర్ టెస్టులు ఎవరికీ నిర్వహించలేదని పేర్కొన్నారు.

## రన్.. ధనాధన్



తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో ఆదివారం నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 3కే, 5కే ఫ్రీడమ్ రన్ ఉత్సాహంగా సాగింది. కార్యక్రమాన్ని భారత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సిక్కిరెడ్డి ప్రారంభించారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు రన్‌లో పాల్గొన్నారు. అనంతరం చెరువులు, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ, సభ్యులు పాల్గొన్నారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)

## కమనీయం సహస్ర నామ పారాయణం



భారతీనగర్ డివిజన్ ఎల్ఐజీ కాలనీలో ఆదివారం కార్యసిద్ధి పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో విష్ణు సహస్రనామ కార్యక్రమం కనులపండువగా సాగింది. శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామి చాతుర్మాస్య దీక్ష మహోత్సవంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో 3వేల మంది భక్తులు విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)

# లక్షణంగా వదిలేశారు

**ఎనిమిదేళ్ల క్రితం టెండర్లు**
- వ్యాపారులకు దుకాణాలు కేటాయించని అధికారులు
- నిరుపయోగంగా షాపింగ్ కాంప్లెక్స్ భవనం
- మున్సిపల్ ఆదాయానికి గండి



జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయం వెనుక షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలు

జహీరాబాద్ టౌన్: మున్సిపల్ అధికారులతీరుతో లక్షల రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. పట్టణంలో వ్యాపార సముదాయాల కోసం రూ.46లక్షలతో నిర్మించిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ భవనం పనికిరాకుండా పోతోంది. టెండర్ ద్వారా దుకాణాలను కేటాయించి ఎనిదేళ్లవుతున్నా వ్యాపారులకు అప్పగించకపోవడతో భవనం నిరుపయోగంగా మారింది. దీని ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా.. బల్దియా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

జహీరాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయానికి వెనుకాల భవానీ మందిరం రోడ్డులో 1990లో రూ.46లక్షలతో మున్సిపల్ అధికారులు 52 దుకాణాలను నిర్మించారు. నెలకు రూ.600 అద్దె ప్రాతిపదికన వ్యాపారులకు కేటాయించారు. కాంప్లెక్స్ దుకాణాల అగ్రిమెంట్ గడువు ముగిసినా.. తక్కువ అద్దె వసూలు చేస్తున్నారని 2016లో కౌన్సిలర్లు సమావేశంలో మున్సిపల్ అధికారులపై మండిపడ్డారు. అనంతరం అద్దెను రూ.2,500లుగా నిర్ణయించారు. సంతృప్తి చెందని కౌన్సిల్ సభ్యులు కొత్తగా టెండర్ పిలవాలని పట్టుబట్టడంతో రెండోసారి బహిరంగ వేలం వేశారు. రూ.5వేల కంటే తక్కువ కాకుండా అద్దె నిర్ణయించగా, 52 షాపులకు గాను ప్రతీ నెలా సుమారు రూ. 2.50 లక్షల ఆదాయం వస్తుందని అంచనా వేశారు. కాగా వివిధ కారణాలతో అధికారులు ఇంత వరకు దుకాణాలను కేటాయించలేదు. ఎనిమిదేళ్లుగా నిరుపయోగంగా ఉండడంతో అద్దె రూపంలో రావాల్సిన సుమారు రూ.25 లక్షల ఆదాయానికి గండి పడింది. దుకాణాలు దక్కించుకున్న కొంతమంది వ్యాపారులు వాటిని గోదాంగా ఉపయోగిస్తున్నట్లు తెలిసింది.

**త్వరగా కేటాయించాలి**



మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌పై అధికారులు శ్రద్ధ చూపడంలేదు. దీంతో లక్షల ఆదాయం నష్టపోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వ్యాపారులకు దుకాణాలను కేటాయించి ఆదాయంపై దృష్టి సారించాలి.

– రాములు, మాజీ కౌన్సిలర్

**వినియోగంలోకి తెస్తాం**



నేను ఇటీవలే కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించా. పని ఒత్తిడితో మున్సిపల్ కాంప్లెక్స్ దుకాణాలపై శ్రద్ధ చూపలేదు. పూర్తి వివరాలు తెలుసుకుని, వ్యాపారులకు దుకాణాలు కేటాయించి వినియోగంలోకి వచ్చేలా చూస్తా.

– మల్లారెడ్డి, మున్సిపల్ కమిషనర్, జహీరాబాద్

# తెరపైకి చంద్రశేఖర్ పేరు!

- కాంగ్రెస్ నుంచి పోటీకి ఆసక్తి
- పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితో చర్చలు
- మా తాతముత్తాతలదీ జహీరాబాదే అంటూ వెల్లడి..



జహీరాబాద్: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వికారాబాద్‌కు చెందిన మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ పేరు తెరపైకి వచ్చింది. ఇప్పటికే శనివారం రాత్రి చంద్రశేఖర్ బీజేపీకి రాజీనామా చేశారు. ఆదివారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వికారాబాద్‌కు చెందిన మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌తో కలిసి చంద్రశేఖర్ నివాసానికి వెళ్లి చర్చలు జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. జహీరాబాద్ నుంచి పోటీ చేసేందుకు సుముఖంగా ఉన్నట్లు ప్రకటించడం చకచకా జరిగిపోయాయి. తన తాత ముత్తాతలు, తల్లిదండ్రులు జహీరాబాద్ నియోజకవర్గంలోని రాజనెల్లి గ్రామానికి చెందిన వారని, భార్య స్వస్థలం జహీరాబాద్ కావడంతో తనకు కలిసివస్తుందని చంద్రశేఖర్ చెప్పుకొచ్చారు. ఈ నెల 18న కాంగ్రెస్‌లో అధికారికంగా చేరుతున్నట్లు ప్రకటించారు. జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సైతం చంద్రశేఖర్ పేరును ప్రతిపాదించినట్లు ప్రచారం సాగుతోంది.

### గీతారెడ్డి ఇంటికి రేవంత్‌రెడ్డి

మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి జె.గీతారెడ్డిని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం రాత్రి ఎంపీపీ అధ్యక్షుడు ఎస్.గిరిధర్‌రెడ్డితో కలిసి ఆమె నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. ఆరోగ్య పరిస్థితుల కారణంగా గీతారెడ్డి ఎన్నికల్లో పోటీచేసే విషయంలో సుముఖంగా లేనట్లు తెలిసింది. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి మంత్రి పదవి, లేదా రాజ్యసభ సీటు ఇవ్వాలనే దానిపై ఓ అంగీకారానికి వచ్చినట్లు సమాచారం. తన స్థానంలో అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చినా అభ్యంతరం లేదని, గెలిచే అభ్యర్థికి అవకాశం ఇవ్వాలని గీతారెడ్డి సూచించినట్లు వినికిడి. ఈ సందర్భంగా వికారాబాద్‌కు చెందిన మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ పేరు ప్రస్తావనకు రాగా ఆమె సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది.



గీతారెడ్డితో సమావేశమైన పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

# అన్ని కులాలకూ బీసీ బంధు ఇవ్వాలి

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి**



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

పటాన్‌చెరు టౌన్: బీసీలోని అన్ని కులాలకూ బీసీ బంధు ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమంలో బీసీల పాత్ర ఎంతో ఉందని, 133 కులాలు ఉంటే కేవలం 13 కులాలకు వారికి మాత్రమే బీసీ బంధు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంబాబు, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సుజాత, ఓబీసీ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ జగదీష్, పటాన్‌చెరు మండల అధ్యక్షుడు నరేందర్ గౌడ్, అసెంబ్లీ బీజేవైఎం కన్వీనర్ రాజగోపాల్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆదిత్య, బలరాం తదితరులు పాల్గొన్నారు.

# కొత్త కోర్సులతో విద్యార్థులకు ప్రయోజనం

**ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్**

జహీరాబాద్: నియోజకవర్గానికి మహాత్మా జ్యోతిరావు పూలే డిగ్రీ బీఎస్సీ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మంజూరైనట్లు ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్ తెలిపారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మూడేళ్ల బీఎస్సీ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సును ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రారంభిస్తామని, ఇది విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కోహీర్ క్రాస్ రోడ్డు వద్ద గతంలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రంలో తరగతులు నిర్వహిస్తామన్నారు. ఆర్థిక మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా త్వరలోనే ప్రారంభించి త్వరలో విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ఈ ప్రాంతంలో నిమ్జ్ కూడా వస్తుండడంతో హాస్పిటాలిటీ సర్వీసెస్ పెరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐటీఐ కళాశాల కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, ఆత్మ చైర్మన్ పెంటారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, నాయకులు మొహియొద్దీన్, విజేందర్‌రెడ్డి, జి.గుండప్ప, విజయ్‌కుమార్, బాబీ, నర్సింహాగౌడ్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

# చెరువు నిండుగా.. పల్లె పచ్చగా

- నీటితో కళకళలాడుతున్న చెరువులు
- పెరిగిన సాగు విస్తీర్ణం



కొడకంచి గ్రామంలో చెరువు కింద సాగవుతున్న వరి

జిన్నారం(పటాన్‌చెరు): ఈ ఏడాది వర్షాకాలం పుష్కలంగా వర్షాలు కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సాగు నీటికి ఇబ్బంది లేకపోవడంతో ఉత్సాహంగా సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. గ్రామాల్లో చిన్న చిన్న చెరువులు కూడా నిండడంతో ఇంతకాలం పడావుగా ఉన్న భూములు కూడా ప్రస్తుతం సాగులోకి వచ్చాయి. గతంతో పోలిస్తే ఈ ఏడాది 500 ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరిగింది. జిన్నారం మండలంలో రైతులు ఎక్కువగా వరి పంట సాగు చేస్తారు. గుమ్మడిదల మండలంలో 600 ఎకరాల్లో సాగైనట్లు అధికారులు చెబుతున్నారు. గుమ్మడిదల మండలంలో ప్రస్తుతం వరి 6వేల ఎకరాలు, పత్తి 410 , మొక్కజొన్న 2,400, కందులు 225 ఎకరాల్లో, జిన్నారం మండలంలో వరి 5,500 ఎకరాల్లో సాగవుతున్నాయి. పత్తి, మొక్కజొన్న, కంది పంటలు ఎక్కువగా గణనీయంగా పెరిగింది. గుమ్మడిదల మండలం కానుకుంట, కొత్తపల్లి, నల్లవల్లి, రాంరెడ్డిబావి, నాగిరెడ్డిగూడెం, గుమ్మడిదల, జిన్నారం మండలంలోని సోలక్‌పల్లి, జిన్నారం, నల్తూర్, అండూర్, కొడకంచి, శివానగర్, వావిలాల గ్రామాల్లో పంటలు సాగు చేస్తున్నారు.

**సంతోషంగా ఉంది**



వానాకాలంలో సరిపడా వర్షాలు కురవడం రైతులకు సంతోషం కలిగించింది. ఉత్సాహంగా పంటలను సాగుచేస్తున్నాం. కొత్త పద్ధతులపై వ్యవసాయ అధికారులు సూచనలు అందిస్తున్నారు.

– బాల్‌షెట్టి, రైతు, గుమ్మడిదల

**అవగాహన కల్పిస్తున్నాం**



కొన్ని మండాల్లో వరిలో వెదజల్లే పద్ధతిపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. పంట సాగులో మెలకువలు అందించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీనివాస్, ఏఓ, గుమ్మడిదల

### కనీస వేతనం ఇవ్వాలి

కొండాపూర్(సంగారెడ్డి): కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం అందించాలని మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. ఆదివారం ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు రూ.26 వేలు వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. యాదగిరి, కిరణ్, మరియమ్మ, శోభ, రమాదేవి, అలీమా, యాదగిరి, నర్సింలు, వినయ్ కుమార్, శ్రీకాంత్, శరత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యాదగిరి

## క్లుప్తంగా

### రియాక్టర్ పేలి ఇద్దరికి తీవ్ర గాయాలు

**పటాన్‌చెరు టౌన్:** రియాక్టర్ పేలి ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈసంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి కథనం ప్రకారం.. పశ్చిమబెంగాల్‌కు చెందిన నిత్యానంద్, జార్ఖండ్‌కు చెందిన రూపులాల్ మహతో పాశమైలారం పారిశ్రామికవాడలోని ఓ కంపెనీలో పనిచేస్తున్నారు. ఈక్రమంలో ఆదివారం పనిచేసే చోట రియాక్టర్ పైకప్పు పేలి తీవ్రంగా గాయపడారు. చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్

**నారాయణఖేడ్:** పేకాటస్థావరంపై ఆదివారం పోలీసులు దాడిచేసి నలుగురిని అరెస్ట్ చేశారు. నారాయణఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఖేడ్ మండలం అబ్బెందలోని షమ హోటల్ ఎదుట జూదం ఆడుతున్నారని రహస్యంగా అందిన సమాచారం మేరకు తెల్లవారుజామున సిబ్బందితో కలిసి దాడిచేశారు. జూదరులు నాందేవ్, ఫయాజ్, గణేష్, ఖదీర్‌ను అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 4,130 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

### రేషన్ బియ్యం పట్టివేత

**నారాయణఖేడ్:** పట్టణంలోని సంగమేశ్వర రైస్ డిపోలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచారనే సమాచారం మేరకు ఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డితో కలిసి దాడి చేసి 12 క్వింటాళ్ల రేషన్ బియ్యం బస్తాలను పట్టుకున్నట్టు ఖేడ్ డిప్యూటీ తహసీల్దార్ సాయిరవి ఆదివారం తెలిపారు. రైస్ డిపో యజమాని సంగమేశ్వర్‌పై కేసు నమోదు చేసి పట్టుబడిన బియ్యాన్ని పౌరసరఫరాల గోడౌన్‌కు తరలించామన్నారు. వివరాలను జిల్లా అదనపు కలెక్టర్‌కు నివేదించామని పేర్కొన్నారు. ఎవరైనా వ్యాపారులు రేషన్ బియ్యం కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### చెట్టుకు బైక్ ఢీకొని ఒకరి మృతి

**పటాన్‌చెరు టౌన్:** బైక్ చెట్టుకు ఢీకొని ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈసంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్‌కు చెందిన శ్రీను (28), మరో ఇద్దరు స్నేహితులు లక్ష్మణ్, బస్వప్ప ముగ్గురు అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేటలో ఉంటూ మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో ఆదివారం రాత్రి బైక్‌పై జిన్నారం మండలం మాదారం వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో జానకంపేట సమీపంలోకి రాగానే బైక్ చెట్టును ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన శ్రీను అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### తప్పిన ప్రమాదం



పొదల్లోకి దూసుకెళ్లిన కారు

**కౌడిపల్లి(నర్సాపూర్):** ముందున్న కారును తప్పించే క్రమంలో కారు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. ఈసంఘటన కౌడిపల్లి అటవీ ప్రాంతంలోని ప్లాంటేషన్ సమీపంలో 765డీ జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. హైదరాబాద్ మణికొండ ప్రాంతానికి చెందిన నియోగి భార్య, కొడుకుతో కలిసి మెదక్ చర్చికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో కౌడిపల్లి దాటిన తర్వాత వెనక నుంచి మరో కారు వేగంగా వచ్చి వీరు ప్రయాణిస్తున్న కారును ఓవర్ టేక్ చేసింది. ఈ క్రమంలో వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ముళ్ల పొదలోకి దూసుకెళ్లింది. కారులో ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. అటుగా వెళ్లేవారు గమనించి వారిని బయటకు తీసుకొచ్చారు. అనంతరం జేసీబీ సహాయంతో కారును బయటకు తీశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# మత్తు.. చిత్తు

- గుప్పుమంటున్న గంజాయి
- బానిసలవుతున్న యువత



గంజాయి మత్తులో యువత చిత్తవుతోంది. సరదాగా ఆకర్షితులై దానిని వ్యసనంగా మార్చుకుంటున్నారు. కొద్దిరోజుల తర్వాత మత్తు లేకుంటే బతకలేమనే స్థితికి దిగజారుతున్నారు. కేవలం యూత్‌ను టార్గెట్ చేస్తున్న కొందరు గంజాయి వంటి మత్తు పదార్థాలను ఇతర ప్రాంతాల నుంచి పట్టణానికి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

**తూప్రాన్:** మెదక్ జిల్లా తూప్రాన్ డివిజన్ కేంద్రంలో పలువురు యువకులు జల్సాలు, షికార్లు, చెడు వ్యసనాలకు బానిసలై దారి తప్పుతున్నారు. తెలిసి తెలియని వయసులో నేరాలకు పాల్పడుతున్నారు. పలు కేసుల్లో చిక్కుకొని జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారు. జిల్లాలో పట్టుబడిన పలు దొంగతనాలకు సంబంధించిన కేసుల్లో యువకులే ఎక్కువగా ఉన్నారు. పోలీసులు విచారించే సమయంలో సరదా కోసం, తల్లిదండ్రులు డబ్బు ఇవ్వకపోవడం, ప్రియురాలికి కానుకలు ఇవ్వడం కోసం అంటూ వెల్లడిస్తున్నారు. తూప్రాన్ పట్టణానికి మేడ్చేల్, కొంపల్లి, హైదరాబాద్, చేగుంట, కామారెడ్డి నుంచి కొందరు వ్యక్తులు గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి అమ్ముతున్నట్టు సమాచారం. కొన్ని ప్రాంతాల్లో సిగరెట్లలో గంజాయి నింపుతూ ఎవరికీ అనుమానం రాకుండా ప్రత్యేక కోడ్‌లతో విక్రయిస్తున్నారు. 10 గ్రాముల నుంచి 100 గ్రాముల ప్యాకెట్‌ను రూ. 300 వందల నుంచి రూ.1,000 వరకు విక్రయిస్తున్నట్టు సమాచారం.

**తూప్రాన్‌లో అడ్డాలు**

పట్టణంలోని గోల్డెన్‌పార్క్, నర్సాపూర్ చౌరస్తాలోని ఓ హోటల్, పట్టణ సమీపంలోని పెద్ద చెరువు కట్ట, దాబా హోటళ్లు, నూతనంగా వెలిసిన వెంచర్లు, బ్యాచ్‌లర్స్ నివాసం ఉంటున్న అద్దె గదులను వాడుకుంటున్నారు. ఈ ప్రాంతాల్లో గంజాయిని సిగరెట్లలో నింపుతున్నారు. బాంగ్, ఓసీబీ, చిలిమ్, అనే రకరాకల పేపరులో గంజాయిని నింపి సిగరెటుగా తయారు చేసుకొని తాగుతున్నారు. హైదరాబాద్‌లో పోలీసుల నిఘా పెరిగిపోవడంతో డ్రగ్స్ మాఫియా పల్లె ప్రాంతాల్లోని యువతపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే జిల్లాలోని కొందరు యువకులతో పరిచయం పెంచుకుని అమ్మకాలు చేయిస్తోంది. వీరిలో ఎక్కువగా మధ్యతరగతి వారి పిల్లలే ఉన్నట్టు సమాచారం.

**చర్యలు తీసుకుంటాం**



తూప్రాన్‌లో గంజాయి వినియోగిస్తున్నట్టు తమ దృష్టికి రాలేదు. ఎప్పటికప్పుడు సీసీ కెమెరాలతో ప్రత్యేకంగా నిఘా పెంచాం. పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. చెడు వ్యసనాలకు గురికాకుండా వారిపై పర్యవేక్షణ ఉండాలి. మంచి స్నేహితులు ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. గంజాయి విక్రయించడం చట్టరీత్యా నేరం. సమాచారం అందిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

– యాదగిరిరెడ్డి, డీఎస్పీ, తూప్రాన్

# బిర్యానీ తెమ్మని.. కారుతో పరారీ

**పటాన్‌చెరుటౌన్:** క్రైమ్ బ్రాంచి పోలీసునని పరిచయం చేసుకున్నాడు. హైదరాబాద్ వెళ్లాలని కారు కిరాయికి మాట్లాడుకున్నాడు. మార్గమధ్యలో ఓ హోటల్ వద్ద ఆపి డ్రైవర్‌ను బిర్యానీ తెమ్మని చెప్పాడు. అతడు వచ్చేలోపే కారుతో ఉడాయించాడు. ఈసంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం గంగాపూర్‌కు చెందిన గండ్ల నరేష్‌గౌడ్ కారు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో శనివారం జహీరాబాద్‌లో ఉండగా ఓ అపరిచిత వ్యక్తి క్రైమ్ బ్రాంచి పోలీసునని సంగారెడ్డి వరకు కారు కిరాయికి కావాలని రూ. 2 వేలకు మాట్లాడుకున్నాడు. జహీరాబాద్ నుంచి వస్తుండగా మార్గమధ్యలో బుదేరా వద్ద ఓ దాబాలో లంచ్ చేసి, అక్కడి నుంచి సంగారెడ్డి పోలీస్‌స్టేషన్ వద్ద ఐదు నిమిషాలు ఆపమన్నాడు. అక్కడి నుంచి ఎస్పీ ఆఫీస్ వద్ద ఫోన్‌లో మాట్లాడాడు. జూబ్లీహిల్స్‌లో సాయంత్రం మీటింగ్ ఉందని డ్రైవర్‌కు తెలిపాడు. అదనంగా రూ. 3 వేలు కిరాయి అవుతుందని చెప్పగా సరే అన్నాడు. హైదరాబాద్ వైపు వస్తుండగా పటాన్‌చెరు మండలం రుద్రారం సమీపంలోని ఓ హోటల్ వద్దకు రాగానే మూడు బిర్యానీలు తీసుకురమ్మని డ్రైవర్‌కు చెప్పి రూ.1000 ఇచ్చాడు. దీంతో డ్రైవర్ బిర్యాని ఆర్డర్ చేశాడు. పది నిమిషాలు పడుతుందని హోటల్ నిర్వాహకుడు తెలపగా.. కారులో ఉన్న వ్యక్తికి చెప్పేందుకు వచ్చాడు. అప్పటికే అతడు కారుతో పరారయ్యాడు. ఈ మేరకు డ్రైవర్ నరేష్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సీసీ ఫుటేజీలో రికార్డయిన అపరిచిత వ్యక్తి

### గంజాయి విక్రేత అరెస్ట్

**సిద్దిపేటకమాన్:** గంజాయి అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన సిద్దిపేట పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. సిద్దిపేట వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ముస్తాబాద్ రోడ్డులో గంజాయి అమ్ముతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు ఎస్ఐ రంజిత్‌కుమార్ సిబ్బందితో కలిసి వెళ్లి తనిఖీ చేశారు. గంజాయి అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఇందిరమ్మకాలనీలో నివాసం ఉంటున్న గోనె భార్గవ్‌గా నిర్ధారించారు. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

# అర్హులందరికీ 'దళిత బంధు' ఇవ్వాలి



బండమైలారంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నర్సారెడ్డి, నాయకులు

**డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి**

**ములుగు(గజ్వేల్):** అర్హులందరికీ దళితబంధు పథకం అమలు చేయాలని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని బండమైలారం, బండతిమ్మాపూర్‌లో ఆదివారం కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్ నియోజకవర్గంలో 17 వేల దళిత కుటుంబాలు ఉన్నాయని, వారందరికీ దళితబంధు మంజూరు చేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి బీసీ బంధు, మైనార్టీ బంధు వర్తింపచేయాలని కోరారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే సీఎం కేసీఆర్ కొత్త పథకాలను తెరపైకి తెస్తున్నాడని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో మళ్లీ గృహలక్ష్మి పేరిట హడావుడి చేస్తున్నారని మండిపడ్డారు. గజ్వేల్ అభివృద్ధి దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని గొప్పలు చెప్పుకుంటున్న మంత్రి హరీశ్‌రావు ఇక్కడి దళితులు, బీసీలు, మైనార్టీలకు ఒరగబెట్టింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. త్వరలో జరగబోయే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్త, నాయకులు బూర్ గణేష్‌యాదవ్, రాజుయాదవ్, కర్ణాకర్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.


### పర్యాటక క్షేత్రంగా రంగనాయక సాగర్



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

**సిద్దిపేటజోన్:** భారతదేశ చిత్ర పటంలో సిద్దిపేట రంగనాయక సాగర్ త్వరలోనే పర్యాటక క్షేత్రంగా మారబోతుందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీష్ రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం చిన్నకోడూర్ మండలం చంద్లాపూర్ గ్రామ రెడ్డి సంఘం బాధ్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామంలో సంఘ భవనానికి స్థలం కేటాయించి మొదటి దశగా భవన నిర్మాణానికి రూ. 30 లక్షలు మంజూరు చేస్తామన్నారు. అంతకు ముందు పట్టణ శివారులో ఒక విల్లా బ్రోచర్ ఆవిష్కరణ సమావేశంలో మాట్లాడారు. అద్భుతమైన లగ్జరీ విల్లాస్ ప్రాజెక్టు సిద్దిపేటకు రావడం సంతోషకరమన్నారు. మరింత మంది ముందుకు వచ్చి గేటెడ్ కమ్యునిటీలు నిర్మించాలని సూచించారు. సినీ హీరో రజనీకాంత్ హైదరాబాద్‌లో జరిగిన అభివృద్ధిని ప్రశంసించారని పేర్కొన్నారు. కరోనా అనంతరం ప్రజల జీవనశైలిలో మార్పు వచ్చిందని ఆహ్లాదకర వాతావరణంలో జీవించాలనుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, సీనియర్ నాయకులు శర్మ, రాజనర్సు పాల్గొన్నారు

### కారు బైక్ ఢీ: ఇద్దరికి గాయాలు



సంఘటనాస్థలంలో క్షతగాత్రులు

**టేక్మాల్(మెదక్):** రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈసంఘటన మండలంలోని బొడ్మట్‌పల్లి చౌరస్తాలో ఆదివారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వ్యక్తి అల్లాదుర్గం వైపునకు కారులో వెళ్తుండగా.. నారాయణఖేడ్‌కు చెందిన ఇద్దరు బైక్‌పై బొడ్మట్‌పల్లి వైపు వస్తున్నారు. ఈక్రమంలో సర్వీస్ రోడ్డులో ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. బైక్‌పై ఉన్న రాథోడ్ రాంప్రసాద్, రాజ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. సంఘటనాస్థలానికి ఎస్ఐ రమేష్ చేరుకొని వివరాలను సేకరించి క్షతగాత్రులను 108లో జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# భర్తతో గొడవపడి ఒకరు.. ఆర్థిక ఇబ్బందులతో మరొకరు..

**పటాన్‌చెరు టౌన్:** భర్తతో గొడవపడి భార్య ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేటలోని లేక్‌వ్యూలో కూరపాటి శ్రీహరిబాబు, శ్రీలక్ష్మి (45), ఒక కుమార్తెతో కలిసి ఉండేవాడు. మూడేళ్ల క్రితం శ్రీహరిబాబుకు కొచ్చిన్‌లో ఉద్యోగం వచ్చింది. దీంతో అప్పుడప్పుడు ఇంటికి వస్తూ వెళ్లేవాడు. అయితే భర్తపై అనుమానం పెంచుకున్న భార్య కొచ్చిన్‌లో ఎవరితో ఉంటున్నావని తరచూ ఫోన్‌లో గొడవ పడుతూ ఉండేది. ఈక్రమంలో శ్రీహరిబాబు ఇటీవలే ఇంటికి రాగా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపంతో శ్రీలక్ష్మి శనివారం అర్ధరాత్రి మెట్ల వద్ద రైలింగ్ రాడ్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**వర్గల్(గజ్వేల్):** ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసయ్యాడు. పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఈఘటన మండలంలోని అనంతగిరిపల్లిలో జరిగింది. గౌరారం ఎస్సై విజయ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాగం రాములు (56)కు భార్య కౌసల్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అందరి వివాహాలు జరిపించాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. అప్పు ఎలా తీర్చాలో తెలియడం లేదని తరచూ భార్యతో చెప్పి బాధపడేవాడు.ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. రోజు మాదిరిగా శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన రాములు పురుగు మందు తాగి గ్రామ శివారు రైల్వే ట్రాక్ వద్ద పడిపోయాడు. గేదెకు నీరు పెట్టేందుకు వెళ్లిన కౌసల్య ట్రాక్ వద్ద పడి ఉన్న భర్తను చూసి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లింది. డాక్టర్ల సూచన మేరకు ములుగు ఆర్వీఎంకు తరలించగా చికిత్సపొందుతూ అదేరోజు రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



రాములు(ఫైల్)

# 'ఉపాధ్యాయులను ప్రభుత్వం ఆదుకోవాలి'

**ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):** ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ టీచర్స్, లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణారావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కరోనా తర్వాత ప్రైవేట్ పాఠశాలలు తీవ్ర ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నాయని, పెరుగుతున్న నిత్యావసర సరుకులకు సరిపడా సిబ్బందికి జీతాలు చెల్లించలేని స్థితిలో ఉన్నామని వాపోయారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# సమస్యల పరిష్కారంలో ముందుంటాం



పొట్లపల్లిలో చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న చాడ వెంకటరెడ్డి, తదితరులు

**హుస్నాబాద్‌రూరల్:** పల్లె పల్లెకు సీపీఐ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పందిల్ల, పొట్లపల్లి, బంజేరుపల్లి గ్రామాల్లో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పాల్గొన్నారు. అయా గ్రామాల్లో జెండా ఆవిష్కరణ చేసి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. పొట్లపల్లిలో వర్షాలకు తెగిపోయిన చెక్ డ్యాంను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెక్ డ్యాం రైతులకు ఉపయోగపడే విధంగా నిర్మించాలన్నారు. రైతుల భూములు కోతకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పదవులు లేకపోయిన ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుంటామని ప్రజలకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, మండల కార్యదర్శులు గడిపె మల్లేశ్, వనేష్, నాయకులు సంజీవరెడ్డి, మాడిశెట్టి శ్రీధర్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లి చేసుకుని వదిలేశాడని..

**అత్తగారింటి ఎదుట కోడలు ఆందోళన**

**టేక్మాల్(మెదక్):** పెళ్లి చేసుకుని భర్త తప్పించుకు తిరుగుతున్నాడని ఆరోపిస్తూ భార్య అత్తింటి వద్ద అందోళనకు దిగింది. ఈ ఘటన ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. టేక్మాల్‌కు చెందిన తుడుం రేణుక, కోటగిరి ప్రేమ్‌కుమార్‌గౌడ్ ప్రేమించుకున్నారు. గతేడాది నవంబర్ 16వ తేదీన శేరిలింగంపల్లిలోని ఆర్యసమాజ్‌లో వివాహం చేసుకున్నారు. కొన్ని నెలలు బాగానే ఉన్నా తర్వాత కలహాలు మొదలయ్యాయి. కులం వేరని మా కుటుంబ సభ్యులు ఒప్పుకోవడంలేదంటూ ఆమెను వదిలి వెళ్లాడు. దీంతో ఆమె టేక్మాల్‌లోని ప్రేమ్‌కుమార్‌గౌడ్ ఇంటికి వెళ్లి నిలదీయగా కుటుంబ సభ్యులు కుమారుడితో మాకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రేమ్‌కుమార్‌గౌడ్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఫిర్యాదు అందిందని.. కౌన్సెలింగ్ ఇచ్చామని, వినని పక్షంలో కేసు నమోదు చేస్తామని తెలిపారు.



ఆందోళన చేస్తున్న రేణుక



### ముందుచూపు లేకనే!

**వెల్దుర్తి(తూప్రాన్):** మండల కేంద్రంలోని మాసాయిపేటలో నిర్మించిన అండర్‌పాస్‌తో అవస్థలు తప్పడం లేదు. భూ మట్టాని కంటే దిగువ ప్రాంతంలో నిర్మించడంతో వర్షం నీరు చేరి ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నీరు వెళ్లేలా సంబంధిత కాంట్రాక్టర్, అధికారులు ఏర్పాట్లు చేయకపోవడంతో వర్షపు నీరు అక్కడే నిల్వ ఉంటుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.





**సాయంకాలం.. సుందర దృశ్యం**

సాయంత్రం సంధ్యా సమయంలో ఆకాశ వీధిలో ఒక్కసారిగా మేఘాలు ఎరుపెక్కాయి. ఆదివారం మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామ శివారులో విండ్ పవర్ పంకల నడుమ ఈ సుందర దృశ్యం కనిపించింది. అటు వైపు వెళ్తున్న వాహనదారులు ఆసక్తిగా తిలకించారు. -ఝరాసంగం(జహీరాబాద్)

# కండ్ల కలకలం

- జాగ్రత్తలు తప్పనిసరి
- ఆదమరిస్తే ఇంటిల్లిపాదికి..



**మెదక్ కలెక్టరేట్:** కండ్ల కలక ప్రజలను కలవర పెడుతోంది. వ్యాధి సోకిన వారు కళ్ల మంటలు తట్టుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే సీజనల్ వ్యాధులు ప్రబలుతుంటాయి. పలు ఆరోగ్య సమస్యలతో జనాలను ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. ప్రధానంగా వైరల్ ఫీవర్, జలుబు, దగ్గు తలనొప్పితో పాటు పలురకాల ఇన్‌ఫెక్షన్లు సోకుతాయి. అయితే కండ్ల కలక ప్రమాదకరమైన జబ్బు కాకపోయిన కళ్లు ఎర్రబడి చూపులో స్పష్టత లోపిస్తుంది. చిట్కా వైద్యంతో సమస్యలు తెచ్చుకోవద్దని.. అప్రమత్తత చాలా అవసరమని డాక్టర్ల సూచిస్తున్నారు.

**కేజీబీవీలో 15 మందికి..**

రామాయంపేట కేజీబీవీ పాఠశాలలో 15 మంది విద్యార్థులకు కండ్ల కలక వ్యాధి సోకడంతో అస్వస్థతకు గురై బాధపడుతున్నారు. పాఠశాలలో వైద్యులు క్యాంపు నిర్వహిస్తూ చికిత్స అందిస్తున్నారు.

**ఐసోలేషన్‌లో ఉండాలి**

కండ్ల కలకవచ్చిన వారు వైద్యులు ఇచ్చిన మందులు వాడుతూ.. 3, 4 రోజులు ఐసోలేషన్‌లో ఉంటే తగ్గిపోతుంది. జిల్లాలో వ్యాధి ప్రభావం అంతగా లేదు. నెలలో 610 కేసులు వచ్చాయి. వ్యాధిగ్రస్తులకు అవసరమైన మందులు ఇవ్వడంతో పలు సూచనలు చేస్తున్నాం. కండ్ల కలక సోకినవారు కుటుంబ సభ్యులకు, బయటి వ్యక్తులకు దూరంగా ఉండాలి. తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలి. కండ్లజోడు పెట్టుకొని, మెత్తని టవల్‌తో కంటి స్రావాన్ని శుభ్రం చేసుకోవాలి. చిన్నపిల్లలు, వృద్ధుల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి.

– చందూనాయక్, డీఎంహెచ్‌ఓ, మెదక్